# ఇకపై సీజీఎల్ పరీక్ష ఆన్‌లైన్‌లో

**ఢిల్లీ:** ప్రతిష్ఠాత్మక కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవల్ ఎగ్జామినేషన్ (సీజీఎల్‌ఈ)ను ఇకపై ఆన్‌లైన్‌లో నిర్వహించాలని స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్‌ఎస్‌సీ) నిర్ణయించింది. పరీక్ష నిర్వహణలో అవకతవకలకు అడ్డుకట్టవేడయంతోపాటు మరింత పారదర్శకత కోసమే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. మరోవైపు పరీక్ష విధానంలోనూ ఎస్‌ఎస్‌సీ మార్పులు చేసింది. తొలిసారిగా వ్యాస రచన పేపర్‌ను ప్రవేశపెట్టింది. నిఘా విభాగంలోని సహాయకులు, ఆదాయపు పన్ను(ఐటీ) విభాగంలోని ఇన్‌స్పెక్టర్ సహా కేంద్ర ప్రభుత్వంలోని వివిధ మధ్య స్థాయి ఉద్యోగాల్లో ఖాళీలను సీజీఎల్‌ఈ ద్వారా భర్తీ చేసే సంగతి తెలిసిందే. ఆప్టికల్ మార్క్ రికగ్నిషన్ (ఓఎంఆర్)కు బదులు ఆన్‌లైన్ విధానంలో పరీక్ష నిర్వహించాలని నిర్ణయించినట్లు చెబుతూ ప్రస్తుత వార్తలను ఎస్‌ఎస్‌సీ ఛైర్మన్ అశీం ఖురానా ధ్రువీకరించారు. దీనిపై ఎస్‌ఎస్‌సీ వెబ్‌సైట్‌లో ఓ వీడియోను ఆయన పొందుపరిచారు. ప్రస్తుత ఏడాదిలో దాదాపు 38 లక్షల మంది అభ్యర్థులు ఈ పరీక్ష కోసం నమోదుచేసుకున్నారు. వీరికి ఆన్‌లైన్ విధానం ద్వారా మరో రెండు నెలల్లో పరీక్షలు నిర్వహిస్తామని ఖురానా వివరించారు. తాజాగా అభ్యర్థుల నుంచి ఎలాంటి దరఖాస్తులు ఆహ్వానించడంలేదని స్పష్టంచేశారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, సిబ్బంది మంత్రిత్వ శాఖలోని సీనియర్ అధికారులు సైతం ఆన్‌లైన్ విధానానికి మద్దతు పలికినట్లు ఆయన తెలిపారు. తాజా మార్పుల ప్రకారం 3దశల్లో సీజీఎల్‌ఈ పరీక్షను నిర్వహిస్తారు.

**ఒకటో దశ:** దీనిలో వంద బహుళ ఐచ్ఛిక ప్రశ్నలు అడుగుతారు. దీని కోసం 1.15 గంటల సమయం ఇస్తారు. ఇంతకు ముందు 200 ప్రశ్నలు అడిగి రెండు గంటల సమయం ఇచ్చేవారు.

**రెండో దశ:** దీనిలో ఎలాంటి మార్పులూ చేయలేదు.

**మూడో దశ:** మొదటి రెండు దశల్లో ఉత్తీర్ణత సాధించినవారు మూడో దశ పరీక్ష రాసేందుకు అర్హులు. దీనిలో వ్యాసరూప ప్రశ్నలుంటారు. వంద మార్కులకు దీన్ని నిర్వహిస్తారు.